
పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# రాష్ట్రంలో ఆరోగ్య ర్యాంకింగ్స్‌లో తూర్పు గోదావరి కి అగ్రస్థానం





- కలెక్టర్ కీర్తి చేకూరి
- డి ఎమ్ హెచ్ వో వెంకటేశ్వర రావు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 23:** రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 2025 వరకు విడుదల చేసిన జిల్లాల వారీ పనితీరు గణాంకాలను అనుసరించి తూర్పు గోదావరి జిల్లా 75.54 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించడం గర్వకారణమని కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అందించిన సేవల నాణ్యత, క్షేత్ర స్థాయి పని తీరు, ఆరోగ్య ప్రచార కార్యక్రమాల అమలులో చూపిన క్రమశిక్షణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ ర్యాంక్ జిల్లా టీమ్ కష్టానికి ప్రతిఫలమని కలెక్టర్ తెలిపారు. ఈ ర్యాంక్ తో ఆగిపోకుండా రాబోయే నెలల్లో శాతం మరింతగా పెంచే దిశగా చర్యలు తీసుకోవా లన్నారు. జిల్లా పై బాధ్యత పెరిగిందని, వచ్చిన ర్యాంకు నిలబెట్టుకునే దిశగా అన్ని విభాగాలు ముందడుగు వేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఈ విజయాన్ని సాధించడంలో కలెక్టర్ కీర్తి చేకూరి సమగ్ర మార్గదర్శకం, నిరంతర పర్యవేక్షణ, సమన్వయ కర్తృత్వం కారణంగానే సాధ్యమైందని జిల్లా వైద్య ,ఆరోగ్య అధికారి డా. కె. వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. జిల్లాలోని ఆరోగ్య సేవల ప్రతి విభాగం ప్రోగ్రామ్ అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, పారా మెడికల్ సిబ్బంది, ఏ ఎన్ ఎం లు, ఆశా, సూపర్వైజర్లు, ఐ సి డి ఎస్ టీమ్స్, ఫీల్డ్ వర్కర్ల కృషిని ఒకే దారిలో నడిపించారన్నారు. ,లక్ష్యాలను చేరుకునేలా చేసిన తూర్పు గోదావరి జిల్లా తరఫున ఆరోగ్య శాఖ అందించిన ఫలితాలకు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తూ, ఇదే ఉత్సాహంతో ప్రజారోగ్య సేవలను బలోపేతం చేస్తామని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ ప్రకటిస్తుందన్నారు.

### డిప్యూటీ ఎంపీడీవో పదోన్నతులు -

# ఉంగుటూరులో పోస్టు కోసం ఆసక్తి

**పనితీరా..? సామాజిక వర్గమా..?**

**ఆ నలుగురిలో ఎవరికీ అదృష్టం?**

**'ధర్మ కాటా' ఎటో వేచిచూస్తున్న ఉంగుటూరు**

**పెన్ పవర్, ఉంగుటూరు**

ఉంగుటూరు మండలంలో డిప్యూటీ ఎంపీడీవో పదవులకు నలుగురు ఉద్యోగులు ప్రమోషన్ పొందారు. వీరిలో ఇద్దరు చాలా కాలంగా ఉంగుటూరు మండలంలోనే పనిచేస్తుండగా, మిగతా ఇద్దరు ఇతర ప్రాంతాల నుండి ఐ డి య ల్ పై ఇక్కడకు వచ్చారు. ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు, మరొకరు పంచాయతీ రాజ్ కార్యాలయ మినిస్టీరియల్ విభాగానికి చెందిన ఉద్యోగి.

ఈ నలుగురిలో ఇద్దరు ఉంగుటూరు మండలంలోనే డిప్యూటీ ఎంపీడీవోలుగా పని చేయాలన్న ఆసక్తిని వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. చివరి నిర్ణయం నియోజకవర్గ ప్రజా ప్రతినిధి సిఫారసుపైనే ఆధారపడి ఉంటుంది అని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

అభ్యర్థుల సామర్థ్యాలపై చర్చ

మినిస్టీరియల్ విభాగానికి చెందిన అభ్యర్థి ు అన్ని శాఖల్లో విస్తృత అనుభవం, కంప్యూటర్ నైపుణ్యం, వివిధ విభాగాల పనితీరుపై పూర్ణ అవగాహన కలిగి ఉన్నారు.

మరో అభ్యర్థి విషయానికి వస్తే కంప్యూటర్ నాలెడ్జి లోపం ఉన్నట్టు సమాచారం.

**డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతలు**

ఉంగుటూరు మండలంలో రెండు డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు ఉన్నాయి

1పంచాయతీ వ్యవహారాల డిప్యూటీ ఎంపీడీవో

పంచాయతీ కార్యదర్శులు, నిధుల వినియోగం, పారిశుద్ధ్యం, పంచాయతీల అభివృద్ధి వంటి అంశాలపై పర్యవేక్షణ.

2సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో

సచివాలయాల పనితీరు, ఉద్యోగుల పర్యవేక్షణ, కార్యాచరణపై అజమాయిషి.

గత నెలలో ఒక డిప్యూటీ ఎంపీడీవో బదిలీపై బాధ్యతలు స్వీకరించారు.

ఇక రెండో పోస్టు కోసం పోటీ తీవ్ర స్థాయికి చేరుకుంది.

ప్రతీక్షలో ప్రజానాయకులు – చర్చలో ప్రజలు

ఉంగుటూరు నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన ఈ మండలంలో అన్ని గ్రామాలు, సచివాలయాలపై అవగాహన ఉన్న, ప్రజలతో దగ్గరగా పనిచేసిన వ్యక్తిని నియమిస్తే, ప్రభుత్వ సంకల్పాలు మరింత వేగంగా అమలవుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రస్తుతం మండల కార్యాలయాల్లో, రాజకీయ వర్గాల్లో చర్చ ఇదే:

అనుభవానికే అవకాశం ఇస్తారా?

పనితీరుకే ప్రాధాన్యతా?

సామాజిక వర్గ సమతౌల్యాన్ని కాపాడతారా?

ఈ నేపథ్యంలో 'ధర్మ కాటా' ఏటో ఉంగుటూరు ఆసక్తిగా ఎదురు చూస్తోంది.



# కాలం చెల్లిన మందులతో ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం

**ప్రభుత్వ ఆసుపత్రిలో సమీక్షలు, అభివృద్ధి అంటున్న స్థానిక ఎమ్మెల్యే ఎక్కడ?**

**మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ విమర్శ**


**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 23,**


కాలం చెల్లిన మందులను ప్రభుత్వ ఆసుపత్రిల్లో రోగులకు ఇచ్చి వారి ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, మాజీ పార్లమెంట్ సభ్యులు, మార్గాని భరత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలం చెల్లిన మందులు వాడటం వల్ల నిండు ప్రాణం బలయ్యిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతీ పది రోజులకు తాను వస్తానని, సమస్యలు తీరుస్తానని, అభివృద్ధి చేస్తానని, సమీక్షల మీద సమీక్షలు చేసిన స్థానిక ప్రజాప్రతినిధి ఎక్కడున్నారని ప్రశ్నించారు. అసలు కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ లేదని తెలుస్తోందని అన్నారు. కాలం చెల్లిన మందులు ప్రభుత్వ దవాఖానాలలో ఉన్నాయంటే ఇంత కంటే దుర్మార్గం లేదని విస్మయాన్ని వ్యక్తం చేశారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎనిమిది నెలల నిండు గర్భిణి సరి అయిన వైద్య సదుపాయం అందక ఆమె మరణానికి బాధ్యులు ఈ కూటమి ప్రభుత్వం కాదా! అని ప్రశ్నించారు. బాధ్యులను శిక్షించే చర్యలు తీసుకునేలా చంద్రబాబు, పవన్ లు కూటమి ప్రభుత్వం వ్యవహరించాలన్నారు.

కరోనా సమయంలో జగన్ ప్రభుత్వం ఎన్నో లక్షల ప్రజల ప్రాణాలు రక్షించిన ప్రభుత్వమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు అవసరం ఉందనే 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు , ప్రభుత్వ ఆసుపత్రులు వస్తె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని వాటిని నిర్మిస్తుంటే అవి కూడా ప్రైవేట్ పరం ప్రభుత్వం చేయడం దారుణం అన్నారు

సిటీ శాసనసభ్యుడికి ప్రజల శ్రేయస్సు మీద శ్రద్ధ లేదని, నిత్యం సంపాదనే ధ్యేయంగా దొరికింది దోచుకోవడమే, నగరాన్ని అన్ని విధాల నాశనం చేస్తున్న ఘనుడని విమర్శించారు. ఇప్పటికైనా విచారణ చేయించి , దోషులకు తగిన శిక్ష విధించి, చనిపోయిన బాధితుని కుటుంబానికి తగు ఆర్థిక సహాయం అందచేయాలని కోరారు.

# చెరుకు రైతులను చేరదీసేది ఎవరు?







**గోపాలపురం,పెన్ పవర్ నవంబర్ 23:** తెలుగువారు సాంప్రదాయబద్ధంగా సాగు చేసే వాణిజ్య పంట చెరుకు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు అన్ని ప్రాంతాల్లోని ప్రజలు తరతరాలుగా చెరుకు పంటను సాగుచేసి జీవనం సాగించేవారు.వరి,చెరుకు పంటలు రెండు రైతులకు రెండు కళ్ళులా ఉండేవి.వరి సాగుచేస్తే తిండి గింజలు ఉంటాయని చెరుకు పండించడం వలన చేతికి రెండు రూపాయలు వస్తాయని రైతులు ఆశించేవారు.దీంతో ఉభయగోదావరి జిల్లాలో మెట్ట ప్రాంతంలో కొద్దిపాటి భూముల్లో తప్ప అధిక విస్తీర్ణంలో రైతులు చెరుకు పంటను పండించేవారు.తాము పండించిన చెరుకును ఉభయగోదావరి జిల్లాలో ఉన్న తణుకు,భీమడోలు,తాడువాయి,పోతవరం,చెల్లూరు,చాగల్లు తదితర గ్రామాల్లోని కర్మాగారాలకు చెరుకును తరలించేవారు.ఇది సంవత్సరకాలం పంట.ఒక ఏడాది విత్తనం నాటితే మరో రెండేళ్లు ఆ విత్తనం ద్వారా చెరుకు పెరుగుతుంది.మొదటి ఏడాది చెరుకు నరికి పంటకు నీరు పెడితే అది మళ్లీ పెరిగి పెద్దదవుతుంది.అలాగే మరో రెండేళ్లు కాలం చేయవలసి ఉంది.ప్రతీ ఏటా నవంబర్ నెల నుండి చెరుకు నరుకులు మొదలు పెడతారు.శీతాకాలంలో చెరుకు కర్రలు పక్వానికి రావడంతో వాటిని నరికి కర్మాగారాలకు తరలించడం ఆనవాయితీ రైతులు తమ పరిధిలో ఉన్న కర్మాగారాలను ఎంచుకుని అక్కడికి తరలిస్తారు.గత కొన్ని ఏళ్లగా అదే పరిస్థితి నెలకొండేది.అయితే చెరుకు కర్మాగారాలకు నష్టం వాటిల్లుతుందనో,మరి ఏ ఇతర కారణాల వలన చెరుకు ఫ్యాక్టరీలు మూతపడు తున్నాయి.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అయిదు కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం అవి అన్ని మూతపడ్డాయి.గత ఏడాది వరకు పనిచేసిన తాడువాయి లోని చెరుకు కర్మాగారం ఈ ఏడాది మూతపడింది.ఆ కర్మాగారం పనిచేసే సమయంలో సుదూర ప్రాంతాల నుండి రైతులు చెరుకు తరలించేవారు.ప్రస్తుతం ఆ కర్మాగారం మూతపడడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.దీంతో ఏళ్ల తరబడి చెరుకు సాగు చేసే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.చెరుకు పంట లేకపోవడం వలన రైతులతో పాటు ఎంతో మంది వ్యవసాయ కూలీలు తుని తదితర ప్రదేశాల నుండి చెరుకు నరకడానికి వచ్చే వారు కర్రలు తరలించే వాహనదారులు కర్మాగారంలో పనిచేసే కార్మికుల పరిస్థితి రోడ్డున పడ్డట్టు అయింది.వారంతా ప్రస్తుతం పనులు లేక ప్రత్యమ్నాయం వైపు ఎదురు చూస్తున్నారు.అక్కడక్కడ చెరుకు పంట ఉంటే దానిని కృష్ణా జిల్లా ఉయ్యూరుకు తరలించవలసి ఉంది.లారీలపై చెరుకు కర్రలను తరలించే సందర్భంలో పలు ప్రమాదాలు ఎదురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.అధిక బరువు కారణంగా రహదారి మలుపు ప్రదేశాల్లో,గోతుల వద్ద లారీలు తిరగబడడం జరుగుతుంది.ఆ సమయంలో మనుషుల ప్రమాదం మాట ఎలా ఉన్నాడు పంట నరికిన ప్రదేశం నుండి కూలీలు రావాల్సి ఉంది.ఉయ్యూరు సుమారు 300 కిలోమీటర్ల లోపు ఉంటుంది.చెరుకు రవాణా చేసే సమయంలో మద్యలో ఏదైనా ప్రమాదం జరిగితే పంట పొలం నుండి అక్కడికి చేరే సరికి పుణ్యకాలం పూర్తవుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.అంత దూరం రవాణా చేయడం సాధ్యపడదు అంటున్నారు.అయితే కొందరు రైతులు మాత్రం చేసేదిలేక తమ పొలాల్లో ఉన్న చెరుకును ఉయ్యూరు రవాణా చేయడానికి అంగీకారం తెలిపినట్టు తెలిసింది.అయితే వారు రవాణాలో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారో వేచి చూడవలసిందే.ఇదిలా ఉంటే ప్రస్తుతం అక్కడక్కడ తక్కువ విస్తీర్ణంలో రైతులు చెరుకు పంటను సాగు చేస్తున్నారు.పండించిన పంటను బెల్లం తయారీకి చెరుకు రసానికి ఉపయోగిస్తున్నారు.మెట్ట ప్రాంతంలో ఎర్నగూడెం,కోరుమామిడి,తణుకు పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడ బెల్లం తయారీ కేంద్రాలు ఉన్నాయి.ప్రస్తుతం అవే చెరుకు రైతుల పాలిట ఆపద్బాంధవులుగా మారాయి.చెరుకు కర్రలను బెల్లం తయారీ కేంద్రాలకు తరలించి వచ్చిన కాస్త కూస్తాతో రైతులు సర్దుకుంటున్నారు.ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చెరుకు కర్మాగారాలను తెరిపించడమా లేదా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసి చెరుకు పంటను పరిరక్షించాలని రైతుల కోరుతున్నారు.

